ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 13 జూన్ 2024

ఆ అదృష్టవంతుడు.. రాముడే..

- తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక..
- చంద్రబాబు మంత్రివర్గంలో చోటు
- రాయచోటి తొలి మంత్రిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రికార్డు
- కలిసొచ్చిన దుడుకు స్వభావం
- సంబరాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు



మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి.. అనే నేను.. శాసనం ద్వారా నిర్మితమైన.. భారత రాజ్యాంగం పట్ల.. నిజమైన విశ్వాసం..విధేయతను చూపుతానని.. భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుతానని.. బుధవారం విజయవాడలో జరిగిన చంద్రబాబునాయుడు మంత్రివర్గ ప్రమాణ స్వీకారంలో.. ప్రమాణం చేసిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డే.. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలలో అదృష్టవంతుడు.



మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలలో మదనపల్లె, పీలేరు, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు సాధించింది. దీంతో గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలు అందరూ చంద్రబాబు క్యాబినెట్‌లో స్థానాన్ని ఆశించారు. ఎవరికి వాళ్లు తమకు తోచిన మార్గంలో ప్రయత్నాలు చేశారు. దీంతో చంద్రబాబు మంత్రివర్గంలో స్థానాన్ని దక్కించుకునే అదృష్టవంతుడు ఎవరా? అని జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చేశారు. ఆ ఎదురు చూపులకు తెరపడుతూ రాంప్రసాద్‌రెడ్డిని అమాత్యయోగం.. వరించింది.

తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంది. రాంప్రసాద్ రెడ్డి తండ్రి మండిపల్లె నాగిరెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారు. గంట గుర్తుపైన గెలిచిన ఆయన తర్వాత గంటా నాగిరెడ్డిగా ఈ ప్రాంతంలో సుపరిచితుడు. మండిపల్లె నాగిరెడ్డి 1985, 1989లో రాయచోటి ఎమ్మెల్యేగా పనిచేశారు. 1992లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన వరుసకు సోదరుడు అయిన నారాయణరెడ్డి ఉప ఎన్నికలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ నారాయణరెడ్డి విజయం సాధించారు. 2003లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన రాంప్రసాద్‌రెడ్డి 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్టును ఆశించారు. అయితే అప్పట్లో టికెట్టు రాలేదు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014లో జై సమైక్యాంధ్ర పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత వైసీపీలో చేరారు. 2019 సాధారణ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. ఆ తర్వాత అధికార పార్టీలో ఇమడలేక ఇంకా మూడు సంవత్సరాలు అధికారం ఉన్నప్పటికీ వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరారు. రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో టికెట్ల విషయమై గట్టి పోటీ ఉన్నప్పటికీ 2024 ఎన్నికల్లో టికెట్టు దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పటికే మూడు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన వైసీపీకి కంచుకోట లాంటి రాయచోటిలో టీడీపీ జెండా ఎగురవేసి రికార్డు సృష్టించారు.

మొట్టమొదటి మంత్రిగా రికార్డు

1951లో రాయచోటి నియోజకవర్గం ఏర్పడింది. 1952లో జరిగిన ఎన్నికల్లో తొలి ఎమ్మెల్యేగా కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ తరఫున స్వాతంత్ర్య సమరయోధుడు యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి గెలిచారు. ఆ తర్వాత ఇప్పటి వరకు జరిగిన అనేక ఎన్నికల్లో 9 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో సుగవాసి పాలకొండ్రాయుడు, మండిపల్లె నాగిరెడ్డితో పాటు గడికోట శ్రీకాంత్‌రెడ్డి కూడా ఉన్నారు. వీరిలో పలువురు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. అయినా మంత్రియోగం దక్కలేదు. అయితే అనూహ్యంగా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి చంద్రబాబు మంత్రివర్గంలో అవకాశం దక్కింది. ఉమ్మడి కడప జిల్లా తెలుగుదేశం పార్టీలో ఎందరో సీనియర్ నాయకులు ఎమ్మెల్యేలుగా గెలిచి ఉన్నప్పటికీ చంద్రబాబు, నారా లోకేశ్ దృష్టిలో ఉన్న రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి పదవి వరించింది.

కలిసొచ్చిన దూకుడు స్వభావం

ఇప్పుడు అందరి నోటా.. వినిపించేది ఒకే మాట.. దూకుడు స్వభావం కలిగిన రాంప్రసాద్‌రెడ్డి ఎలా ఎమ్మెల్యేగా గెలిచాడు..? మంత్రి పదవి ఏ విధంగా వచ్చింది.? దీనికి అతడి వర్గీయుల నుంచి సమాధానం.. ఒకటే.. దూకుడు స్వభావమే మా నాయకునికి కలిసొచ్చిందని.. ఇంకా అధికారం సుమారు రెండున్నర సంవత్సరాలు ఉండగానే అధికార పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆయన మొదటి నుంచీ కొంచెం దూకుడుగానే వ్యవహరించారు. చిన్నమండెం మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై ఓ కేసు విషయమై పోలీసుస్టేషన్‌ను కార్యకర్తలతో కలిసి ముట్టడించాడు. ఈ సందర్భంగా అప్పుడు ఆయనపై కేసు నమోదైంది. అటువంటి సంఘటనలే ఇంకా ఒకటి రెండు జరిగాయి. తర్వాత గత ఏడాది ఆగస్టులో అంగళ్లు, పుంగనూరులలో టీడీపీ అధినేత చంద్రబాబుపైన మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీలు బాహాబాహికి దిగారు. ఈ గొడవల్లో రాంప్రసాద్‌రెడ్డి స్వయంగా పాల్గొన్నాడు. దీంతో ఇతనిపైన హత్యాయత్నం కేసు నమోదైంది. ఇటువంటి సంఘటనల వల్ల చంద్రబాబు, నారా లోకేశ్ దృష్టిలో పడ్డారు. ఈ నేపథ్యంలో.. రాయచోటి ఎమ్మెల్యే టికెట్టును రాంప్రసాద్‌రెడ్డికి కేటాయించారు.

సంబరాల్లో.. టీడీపీ కార్యకర్తలు, నాయకులు

మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి దక్కడం పట్ల రాయచోటి ప్రాంత ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేకులు కట్ చేసి. స్వీట్లు పంచిపెట్టారు. రాంప్రసాద్‌రెడ్డి కార్యాలయం వద్ద పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి మంత్రివర్గ ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. వెనుకబడిన ప్రాంతమైన రాయచోటికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కడం.. ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు ఆశిస్తున్నారు. అనూహ్యంగా రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడం జిల్లా రాజకీయాల్లో సంచలనం కలిగించింది.

బయోడేటా

తండ్రి	: మండిపల్లి నాగిరెడ్డి
తల్లి	: సుశీలమ్మ
భార్య	: హరితరెడ్డి
సంతానం	: కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి, కుమార్తె నాగ వైష్ణవిరెడ్డి
విద్యార్హత	: పదో తరగతి వరకు కడపలోని నాగార్జున పబ్లిక్ స్కూల్, ఇంటర్మీడియట్ తిరుపతిలోని రాయలసీమ రెసిడెన్షియల్ కాలేజి, బెంగళూరులో బీడీఎస్ పూర్తి చేశారు.




పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

నేటి నుంచి విద్యార్థుల బడిబాట

- తెరుచుకోనున్న పాఠశాలలు
- జిల్లా వ్యాప్తంగా 2757 పాఠశాలలు
- 2 లక్షల 47 వేల 870 మంది విద్యార్థులు

రాయచోటిటౌన్, జూన్ 12: జిల్లాలోని విద్యార్థులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. ఈనెల 13వ తేదీ గురువారం నుంచి అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్రీయ విద్యాలయం, నవోదయ పాఠశాలలు, మదరసాలతో కలిపి అన్ని యాజమాన్యాల కింద 2757 పాఠశాలలు ఉండగా అందులో 2 లక్షల 47 వేల 870 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో ప్రభుత్వ పాఠశాలలు 2200 ఉండగా వాటిలో ఒక లక్షా 43 వేల 8 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే 547 ప్రైవేటు పాఠశాలలు ఉండగా అందులో లక్షా 3 వేల 543 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే జిల్లా పరిధిలోని రాజంపేటలో గల కేంద్రీయ విద్యాలయంలో 355 మంది విద్యార్థులు ఉండగా రాజంపేట, మదనపల్లె ప్రాంతాల్లో గల రెండు నవోదయ పాఠశాలల్లో 621 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే జిల్లాలో ఉన్న 7 మదరసాలలో 343 మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇవన్నీ కూడా గురువారం నుంచి తెరుచుకోనున్నాయి. ఇప్పటికే పిల్లలు తల్లిదండ్రులు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వస్తువులను కొనుగోలు చేయించడమే కాకుండా ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం పుస్తకాలు, నోట్‌బుక్స్ కొనుగోలు చేసి పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే ఉపాధ్యాయులు సెలవుల్లో ఎన్నికల విధులను నిర్వర్తించడమే కాకుండా పరీక్షల నిర్వహణ, స్పాట్ వాల్యుయేషన్, విహారయాత్రలు ఇలా అన్ని రకాల పనులు ముగించుకుని గురువారం నుంచి పాఠశాలలకు వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు విద్యాకానుక కిట్లను యధావిధిగా పంపిణీ చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం మారితే విద్యాకానుక కిట్లు ఉంటాయో లేదో అన్న తల్లిదండ్రుల ఆలోచనలకు తెరపడే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలియజేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే చిక్కీలపైన గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ఉండేవి, ప్రస్తుత ప్రభుత్వం ఆ ఫొటోలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ గుర్తును ఏర్పాటు చేసి ఇప్పటికే ఆయా పాఠశాలలకు, మండల కేంద్రాలకు సరఫరా చేశారు. పాఠశాలల ప్రారంభం నుంచి చిక్కీలతో పాటు రాగి జావను విద్యార్థులకు అందించనున్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్లి

గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతి చెందిన కావడి నరసింహులు

చెన్నూరు/వల్లూరు, జూన్ 12: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి విజయవాడకు వెళ్లిన వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం వెంకటేశాపురం వాసి కావడి నరసింహులు (71) తీవ్ర ఉద్వేగానికి గురై గుండెపోటుతో మృతిచెందాడు. ఈయనకు తెలుగుదేశం పార్టీ అన్నా చంద్రబాబు అన్నా ఎనలేని అభిమానం. ఎన్నికల్లో వల్లూరు మండలం సహా స్వగ్రామంలో పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డిని కమలాపురం ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రచారం చేశాడు. అలాంటి వ్యక్తి బుధవారం విజయవాడలో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని కనులారా చూసి ఆనందించాలని మంగళవారం రాత్రి చెన్నూరు నుంచి మరికొందరితో కలసి బస్సులో బయల్దేరాడు. అప్పటికే తీవ్ర ఉద్వేగంతో ఉన్న ఆయన అర్ధరాత్రి దాటిన తరువాత చిన్నపాటి అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం ఉదయం వెంట చెన్నూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుల చలపతి, బీసీ సెల్ మండల కార్యదర్శి కుందేటి క్రిష్ణయ్య, ఆర్ఎంపీ వైద్యుడు పిచ్చయ్య, శివాలయాలపల్లె బీసీ నేత శ్రీనివాసులు ఆయనను విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆటోలో తీసుకుపోయారు. ఆస్పత్రిలో చేర్చగానే ఒక్కమారుగా గుండె చేత్తో గట్టిగా పట్టుకుని మృతి చెందాడు.
పార్టీలో సీనియర్ కార్యకర్తగా ఉంటూ చెన్నూరు, వల్లూరు మండలాల్లో టీడీపీ కోసం తపించే ఆయన తమ కళ్లెదుటే చనిపోవడంతో వెంట ఉన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆవేదనకు గురి అయ్యారు. మృతదేహాన్ని విజయవాడ నుంచి ప్రైవేటు అంబులెన్స్ ద్వారా వల్లూరు మండలం వెంకటేశాపురానికి తరలించారు. ఆరోగ్యంగా వెళ్లిన నరసింహులు చనిపోయి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పార్టీ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని బాధిత కుటుంబానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి భరోసా ఇచ్చారు.



సత్యను వరించిన

మంత్రి పదవి

- మదనపల్లెలో ఏబీవీపీ కార్యదర్శిగా..

కడప, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ధర్మవరం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వాస్తవానికి ఈయనది అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామం. అయితే వీరు చాలా కాలం క్రితమే ప్రొద్దుటూరులో స్థిరపడ్డారు. తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు టీడీపీ కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కించుకున్నారు. విద్యార్థి దశ నుంచే సత్యకుమార్ యాదవ్ రాజకీయాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. మదనపల్లిలో పాలిటెక్నిక్ చదువుకుంటున్న సమయంలో ఏబీవీపీ తరఫున కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై ఆ యూనియన్‌లో తనదైన ముద్ర వేశారు. విద్యాభ్యాసం అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వద్ద కార్యదర్శిగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన బీజేపీ, 2018లో పార్టీ జాతీయ కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఆయన బీజేపీ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జిగా, అండమాన్ నికోబార్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే మొదటిసారి. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి ఈ సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా బరిలో దిగి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. దీంతో ప్రొద్దుటూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

- జిల్లావ్యాప్తంగా ఎన్డీయే నేతల ఆనందోత్సాహాలు
- భారీ ర్యాలీలు
- ములకలచెరువులో ఆకట్టుకున్న కేరళ కళాకారుల ప్రదర్శన


ములకలచెరువులో భారీ ర్యాలీ చేస్తున్న జయచంద్రారెడ్డి, కట్టా దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా, తదితరులు

రాయచోటి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన సంబరాలు అంబరాన్నంటాయి. ఎక్కడ చూసినా భారీ ఎల్ఈడీ స్క్రీన్లలో చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. భారీ ర్యాలీలు, అన్నదానాలు, బాణాసంచా పేలుళ్లతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీఎన్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అధ్వర్యంలో ములకలచెరువులో సంబరాలు జరిగాయి. భారీ ర్యాలీలో కేరళ కళాకారులు నిర్వహించిన డప్పు ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టారు. అలాగే మార్కెట్ యార్డులు మూడు వేల మందికి అన్నదానం చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మదనపల్లెలో 300 బైక్‌లతో ర్యాలీ

చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణస్వీకారం చేయడంతో మదనపల్లెలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సంబరాలు మిన్నంటాయి. స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. స్థానిక శేషమహల్ సర్కిల్ వద్ద టీడీపీ సీనియర్ నేత కె.హెచ్. ప్రశాంత్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్రపటం ఎదుట 101 టెంకాయలు కొట్టారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మార్పురి వరుణ్, శేషాచలపతినాయుడు, అమ్మినేనివీధి చిన్ని ఆధ్వర్యంలో 300 బైక్‌లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీరామ హరిహరన్, హరినాథ్‌దేవర, తదితరులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను చేతపట్టి ఊరేగించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్క్రీన్, ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మంత్రివర్గం ప్రమాణస్వీకారాన్ని లైవ్‌లో ప్రదర్శించారు. ఎంపీడీవో భానుప్రసాద్, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ఉపాధి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో...

చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బుధవారం రైల్వేకోడూరులో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించడానికి విజయ కన్వెన్షన్‌లో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు మండలం ఓబనపల్లె గ్రామస్థుల ఆధ్వర్యంలో బయనపల్లె నుంచి రైల్వేకోడూరు ప్రధాన దారుల్లో భారీ ఎత్తున బాణాసంచా కాల్చుతూ చంద్రబాబు చిత్రపటాన్ని ఊరేగించారు. యువకులు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

రాయచోటిలో...

రాయచోటి నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన మంత్రి పదవి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూపంలో రావడంతో నియోజకవర్గ ప్రజలకు, తెలుగు తమ్ముళ్ల ఆనందాలకు అవధులు లేవనే చెప్పవచ్చు. ఆయన స్వగ్రామం అయిన చిన్నమండెం మండలంలో తమ ప్రాంత వాసికి రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం కల్పించడంతో మండల కేంద్రంలోని మఖాన్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా మండిపల్లి ప్రమాణస్వీకారం చేస్తుండగా ఆయన అభిమానులు, తెలుగు తమ్ముళ్లు బాణాసంచాలు పేలుస్తూ కేక్ కట్ చేసుకుని మిఠాయిలు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారంతో పాటు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంత్రిగా చేపట్టిన ప్రమాణస్వీకారాన్ని వీక్షించేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రాయచోటికి తరలివచ్చారు. దీంతో రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల టీడీపీ కార్యాలయం తెలుగుదేశం పార్టీ శ్రేణులతో నిండిపోయింది. ఈ సందర్భంగా వారు బాణాసంచా పేల్చి కేక్‌లు కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేపట్టారు. వీటితో పాటు రాజంపేట, పీలేరుతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంబరాల్లో మునిగిపోయారు.


మదనపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బైక్ ర్యాలీ చేస్తున్న టీడీపీ యువ నాయకులు


రైల్వేకోడూరులో మోటారు సైకిల్ ర్యాలీ చేస్తున్న నాయకులు, అభిమానులు


చిన్నమండెంలో ఎల్ఈడీ స్క్రీన్ వద్ద మండిపల్లి ప్రమాణస్వీకారాన్ని తిలకిస్తున్న తెలుగు తమ్ముళ్లు

బడిఈడు పిల్లలు

బడిలోనే ఉండాలి : డీఈవో

రాయచోటిటౌన్, జూన్ 12: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని బడి బయట ఉండకూడదని, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి శశికళ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై రాయచోటిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ విభాగం ఏర్పడిందని, బాల కార్మికులు ఎక్కడైనా కనబడితే తమ కు తెలియజేయాలని సూచించారు. మన కట్టుబాట్లపై పనిచేద్దాం, బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం అనే నినాదంతో ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా లేబర్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 0-18 సంవత్సరాలలోపు బాలలను పనిలో చేర్చుకోకూడదని అలాంటి పిల్లలను లేబర్ డిపార్టుమెంట్ వారు బాలల సంరక్షణ అధికారులు తమ దృష్టికి తీసుకువస్తే వారి చదువుకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లేబర్ డిపార్టుమెంట్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి ఆఫీసర్ డీవీ రంగరాజు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆప్కాబ్ చైర్‌పర్సన్

రాజీనామా

- నేడు డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి కూడా...?

కడప(రూరల్) జూన్ 12: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సారథ్యంలో బుధవారం ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవికి మల్లేల ఝాన్సీరాణి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆప్కాబ్ కేంద్రకార్యాలయంలో బుధవారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. కడప కేంద్రసహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్‌పర్సన్ పదవికి సైతం గురువారం రాజీనామా చేయనున్నట్లు తెలిసింది.

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డీసీసీబీ పాలక మండలికి ఎన్నికలు నిర్వహించకుండా త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసి డీసీసీబీ చైర్మన్‌గా తిరుపాల్‌రెడ్డిని నియమించారు. తరువాత ఆయన స్థానంలో 2021 జూలై 31న మల్లెల ఝాన్సీరాణి డీసీసీబీ చైర్‌పర్సన్‌గా వచ్చారు. ఈ నేపథ్యంలో 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమిపాలైంది. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ, ప్రభుత్వేతర అనుబంధ సంస్థలకు కట్టబెట్టిన నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయాలని ఆదేశించారు. ఆదేశాలు వెలువడిన మరుసటి రోజు నుంచే ఇతర జిల్లాల్లోని సహకారశాఖ పరిధిలోని డీసీసీబీ చైర్మన్లు, ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల త్రిసభ్య పర్సన్ ఇన్‌చార్జి కమిటీ బాధ్యతలు చేపడుతున్న అధ్యక్షులు రాజీనామాలు చేశారు. అయితే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోని కడప కేంద్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఉంటున్న మల్లెల ఝాన్సీరాణి మాత్రం తమ నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయకుండా కొనసాగుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో 'డీసీసీబీ చైర్‌పర్సన్ రాజీనామాలో మడతపేచీ' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం వెలువడింది. దీనిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్న నేపథ్యంలో బుధవారం మల్లెల ఝాన్సీరాణి ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి కూడా గురువారం రాజీనామా చేయనున్నారని సమాచారం.



రామునికి మంత్రి పదవి పట్ల హర్షం



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో సుగవాసి ప్రసాద్‌బాబు, రాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న సంబేపల్లె టీడీపీ శ్రేణులు, విజయవాడలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన కోడూరు నేతలు

రాయచోటి టౌన్/లక్కిరెడ్డిపల్లె/గాలివీడు/చిన్నమండెం/సంబేపల్లె/రైల్వేకోడూరు/సుండుపల్లె/వీరబల్లి/ జూన్ 12: రాయచోటి ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడంతో రాయచోటి టీడీపీ నేతల సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారంతో పాటు రాంప్రసాద్‌రెడ్డి మంత్రిగా చేపట్టిన ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రాయచోటికి తరలివచ్చారు. దీంతో పట్టణంలోని ఎస్‌ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయం టీడీపీ శ్రేణులతో నిండిపోయింది. అంతేగాక రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె కొత్తపేట, గాలివీడు రోడ్డు, కొత్తపేట, రామాపురం, మదనపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో అభిమానులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అలాగే మైనార్టీ యువత పెద్ద ఎత్తున ద్విచక్రవాహనాలకు జెండాలు కట్టి పట్టణ పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. అలాగే రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల, మాధవరం, దిగువ అబ్బవరం, పెమ్మాడపల్లి, వరిగపాపిరెడ్డిగారిపల్లె తదితర ప్రాంతాల్లో గ్రామీణులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మంత్రి పదవి దక్కడంతో ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేసుకున్నారు.

మండిపల్లికి శుభాకాంక్షలు

ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన పవన్‌కల్యాణ్, నారాలోకేశ్ బాబు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంత్రిగా రావడం పట్ల రాయచోటి నియోజకవర్గ వాసిగా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మైనార్టీ సోదరులతో కలిసి పట్టణంలోని బండ్లపెంట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అన్వర్‌బాషా, కోఆప్షన్ సభ్యులు ఆసిఫ్‌అలీఖాన్, మసూద్ అలీఖాన్, గయాజ్ అలీఖాన్, ఖాదర్‌హుస్సేన్, బాషా, వహీద్, గౌస్, దర్గా కమిటీ సభ్యులు ఇసాక్ పాల్గొన్నారు.

మంత్రికి ఉపాధ్యాయ నేతల సన్మానం

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం విజయవాడ గెస్ట్‌హౌస్‌లో పీఆర్టీయూ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ సంఘ చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు, అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ, సంబేపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు కులశేఖర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మండిపల్లిని కలిసిన బీజేపీ నేతలు

మండిపల్లిని బుధవారం విజయవాడలో బీజేపీ నేతలు డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు, నిర్మల్‌కుమార్, మహేశ్వర్‌రాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లెలో.. టీడీపీ ప్రధాన కార్యదర్శి మద్దిరేవుల బాబుల్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శంకారపు జయరాం, మండల యూత్ ప్రెసిడెంట్ షేక్ ఆరిఫుల్లా, రాజంపేట డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్, వల్లూరు పెద్ద రెడ్డెప్పరెడ్డి, వసంతు కృష్ణమోహన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఏ1 కాంట్రాక్టర్ పాయయ్యలు లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలిలో టపాసులు పేల్చి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. దప్పేపల్లె, కుర్నూతల, రవీంద్రనగర్ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

గాలివీడులో.. మండిపల్లి అభిమానులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో బాణాసంచా పేల్చి స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. నూలివీడులో మాజీ ఎంపీటీసీ పొట్టి పార్వతమ్మ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బాణాసంచాలు పేల్చి మంత్రి రాముడు జిందాబాద్ అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సంబేపల్లెలో... సంబేపల్లె, దుద్యాల, పెద్దజంగంపల్లి, అడవికమ్మపల్లె, శెట్టిపల్లె, గుట్టపల్లె, దేవపట్ల, నారాయణరెడ్డి, మోటకట్ల గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్య యాదవ్ స్థానిక నాయకులతో విజయవాడకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, ధర్మారెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో.. హసనాపురం గ్రామం చీకటివాండ్లపల్లెలో ప్రజలు, కార్యకర్తలు రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చిన సందర్భంగా పాలాభిషేకం చేశారు. చిట్లూరు గ్రామంలో సురేందర్‌రెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డిల ఆధ్వర్యంలో బాణాసంచాలు పేల్చి స్వీట్లు పంచారు.

చిన్నమండెంలో... మండల కేంద్రంలోని మఖాన్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా రాముడు ప్రమాణస్వీకారం చేస్తుండగా ఆయన అభిమానులు బాణాసంచాలు పేల్చారు. కేక్ కట్ చేసుకుని మిఠాయిలు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

రైల్వేకోడూరులో.. రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు రమణయాదవ్‌లు విజయవాడలో ప్రమాణస్వీకారం అనంతరం కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సి ఉందని తెలియజేశారు.

వీరబల్లిలో... రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డిలు మండిపల్లికి మంత్రి పదవి దక్కడంతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

సుండుపల్లెలో.. చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు తెలిపారు. బుధవారం అమరావతిలో చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, శివరాంనాయుడు, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబునాయుడు, ఆనంద్‌నాయక్, యూనియన్ బాషా, యర్రంరెడ్డి, కిరణ్ నాయుడు పాల్గొన్నారు. అలాగే రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడం అభివృద్ధికి సూచిక అని జిల్లా కాంగ్రెస్ నాయకుడు గాజుల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.



నూలివీడులో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు, రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు, సుండుపల్లె మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రూ.20,500 ఆర్థిక సాయం

చిట్వేలి, జూన్ 12: కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం సీతారాంపేట గ్రామానికి చెందిన బలరామయ్య(32)కు చిట్వేలి మానవత సంస్థ రూ.20,500 ఆర్థికసాయం అందించారు. ఆయనకు క్యాన్సర్ సోకడంతో వైద్యులు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని సూచించారు. దీంతో మండలం నుంచి ఫోన్ పే ద్వారా వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు.



బాసట ఆర్థికసాయం



చెక్కును అందిస్తున్న బాసట ప్రతినిధులు

కడప(ఎర్రవంక్కపల్లె), జూన్ 12: ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే విద్యార్థిని పుత్తా శివహాసినికి బాసట ఆర్థికసాయం అందించింది. ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లె వాసి పుత్తా శివహాసిని టెన్త్‌లో 583 మార్కులు సాధించింది. తల్లి అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఉండేది. కుమార్తె ఇంటర్మీడియట్ విద్య కోసం బాసట సంస్థను ఆశ్రయించగా బాసట సభ్యురాలు వై.మంజులరెడ్డి, ఎం.జయంతి వారి కుమార్తె, అల్లుడు హర్షితారెడ్డి, అఖిల్‌రెడ్డి స్పందించి రూ.25 వేల చెక్కును అందజేశారు. శివహాసిని, ఆమె తల్లి, బాబాయిలు పాల్గొన్నారు.

రూ.5 లక్షల ప్రతిమ బహూకరణ

చిట్వేలి, జూన్ 12: మండలంలోని నగరిపాడు రంగనాయకస్వామి ఆలయానికి రూ.5 లక్షలు విలువ చేసే స్వామివారి ప్రతిమను భక్తులు అందజేశారు. చిన్నపోలు రంగారెడ్డి జ్ఞాపకార్థం కువైత్ దేశంలో ఉంటున్న నగరిపాడు పంచాయతి కంసాలపల్లె గ్రామానికి చెందిన ఆయన సతీమణి సుబ్బలక్షుమ్మ కుమారుడు చినుపోలు శరత్‌కుమార్ రెడ్డి, రాజేశ్వరి దంపతులు, కుటుంబ సభ్యులు రంగనాయక ప్రతిమను వెండితో తయారు చేసి అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగాచారికి ఈ ప్రతిమను అందజేశారు.

నేడు రాజంపేటలో కరెంటు కోతలు

రాజంపేట, జూన్ 12: రాజంపేట సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 220 కేవీ లైన్లు మారుస్తున్న సందర్భంగా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరెంటు నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారి సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



వాడవాడలా టీడీపీ నేతల సంబరాలు

ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వాడవాడలా టీడీపీ నేతలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా రాయచోటి, రాజంపేట, కోడూరు నియోజకవర్గాల్లో కేకులు కట్ చేసి పంచారు.

ఓబులవారిపల్లె/రైల్వేకోడూరు/నందలూరు/సిద్దవటం/ఒంటిమిట్ట, జూన్ 12: ఓబులవారిపల్లెలో... మల్లాలమ్మ గుడిలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

రైల్వేకోడూరులో.. టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాబు ప్రమాణస్వీకారాన్ని ప్రజలు వీక్షించడానికి విజయ కన్వెన్షన్‌లో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. మండలంలోని ఓబనపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో బయనపల్లె నుంచి రైల్వేకోడూరు ప్రధానదారుల్లో భారీ ఎత్తున బాణాసంచా కాల్చుతూ చంద్రబాబు చిత్రపటాన్ని ఊరేగించారు. యువకులు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

నందలూరులో.. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం శుభపరిణామమని, ఇకపై రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని టపాసులు పేల్చి, కేక్ కోసి సంబరాలు నిర్వహించారు.

సిద్దవటంలో.. మాధవరం-1, 2, 3 గ్రామ పంచాయతీలోని తెలుగు యువత ఆధ్వర్యంలో టీడీపీ నేతలు శ్రీనివాసులు, మునగాపాటి రఘు, చింతగింజలసుబ్రమణ్యం, చెన్నం సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నడివీధి గంగమ్మతల్లి గుడి ఎదురుగా 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఒంటిమిట్టలో.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేపట్టడంతో మండల సీనియర్ టీడీపీ నాయకుడు కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మండలంలో సంబరాలు నిర్వహించారు.

ప్రారంభమైన గంగమ్మతల్లి జాతర

రైల్వేకోడూరు, జూన్ 12: కొత్తకోడూరులో గంగమ్మజాతర ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భారీ ఎత్తున గంగమ్మతల్లి ప్రతిమతో కూడిన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కొత్తకోడూరుకు వెళ్లే దారిలో మొత్తం అలంకరణలు చేశారు. భారీగా స్వాగత బోర్డులు చేశారు. బుధవారం రాత్రి పల్లకీని కొత్తకోడూరుకు తీసుకొచ్చి అక్కడ గంగమ్మతల్లి ప్రతిమను అర్ధరాత్రి తయారు చేస్తారు. గురువారం తెల్లవారుజామున గంగమ్మతల్లిని పల్లకిలో ఊరేగిస్తారు. 14న గంగమ్మతల్లిని నిమజ్జనం చేస్తారని నిర్వాహకులు చెన్నంశెట్టికుమార్ తెలిపారు.

బాల కార్మికులను బడికి పంపాలి

రైల్వేకోడూరు, జూన్ 12: బాల కార్మికులను పనులకు పంపకుండా బడికి పంపాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ యశోద తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు పట్టణంలోని గిరిజాలేన్‌లో ఉన్న గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి, తొటిల్లు అంగన్వాడీ కేంద్రం కార్యకర్త కాత్యాయని, సహాయకురాలు ప్రభావతి, ట్రస్ట్ కో-ఆర్డినేటర్ భావన, గ్లోబల్ వలంటీర్లు లోకేష్, పల్లవి, లహరి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

పుల్లంపేట, జూన్ 12: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కార్యకర్తలు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నెల 9న అమర్‌నాథ్ యాత్ర ముగించుకుని బస్సులో తిరిగి వస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో యాత్రికులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుల్లంపేటలో ర్యాలీ నిర్వహించారు.



సభా వేదిక వద్ద కోలాహలం





వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

40 మామిడిచెట్లు నరికివేత



మారెళ్లమడకలో నరికివేతకు గురైన మామిడిచెట్లు

చక్రాయపేట, జూన్ 12: మండలంలోని మారెళ్లమడక గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు 40 మామిడిచెట్లను నరికివేశారు. 20రోజుల క్రితం యోగాంజులరెడ్డి, వాసు దేవరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలకు సంబంధించిన 120 మామిచెట్లను దుండగులు నరికి వేశారు. ఆ ఘటన మరువక ముందే మంగళవారం రాత్రి వాసుదేవ రెడ్డికి చెందిన 40 మామిచెట్లను నరికివేశారు. మారెళ్లమడక గ్రామంలో మామిడి చెట్లను నరికేసిన ఘటనలో అప్పట్లో సీఐ గోవిందరెడ్డి, ఎస్‌ఐ రంగనాథ్‌లు పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. డాగ్‌స్క్వాడ్ ప్రవేశపెట్టినా ఫలితం లేదు. మళ్లీ ఇపుడు 40 చెట్లను నరకడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఎవరు చేస్తు న్నారో.. ఎందుకు చేస్తున్నారో తెలియకపోవడంతో రైతులు తలలు బాదుకుంటున్నారు. గ్రామంలో కక్షలు, కార్పణ్యాలు లేక పోయినా మామిడిచెట్లు నరికేస్తున్నారని కొందరు... మరికొందరు గ్రామంలో కోల్డ్‌వార్ జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా ఇలా చేతికి అందివచ్చే మామిడిచెట్లను నరికివేయడాన్ని బాధిత రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దుండగులను గుర్తించాలని కోరుతున్నారు. కాగా, కోతకు వచ్చిన మామిడిచెట్లు నరికివేతకు గురవడంతో దాదాపు రూ.10లక్షలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోలు బంకు సమీపంలో చెలరేగిన మంటలు

- **టియర్ గ్యాస్‌తో మంటలు ఆర్పివేసిన సిబ్బంది**



బద్వేలు రూరల్, జూన్ 12: పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో బుధవారం మంటలు చెలరేగిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. అప్రమత్తమైన సిబ్బంది టియర్‌గ్యాస్‌తో మంటలు ఆర్పివేయడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలిలా.. వర్షాకాలం కావడంతో హెచ్‌పీ పెట్రోలు బంకులో పెట్రోలు నిల్వ ఉండే ట్యాంకరు చుట్టూ నీరు చేరడంతో నీటిని బయటికి తోడే క్రమంలో కాస్త పెట్రోలు నీటిలో కలిసినట్లు సమాచారం. తోడేసిన నీళ్ల సమీపంలోని టీ షాపు వద్ద వరకు ప్రవహించాయి. టీషాపు వద్ద ఎవరో సిగరెట్ తాగి పీకను పడివేయడంతో ఉన్న ట్లుండి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పెట్రోలు బంకు సిబ్బంది హుటాహుటిన టియర్‌గ్యాస్ ఉపయోగించి మంటలు ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదమే తప్పినట్లయింది.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

చెన్నూరు, జూన్ 12: స్థానిక గోదినవారివీధి వాసి సాదు మహేశ్ (27) ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. కాగా బుధవారం వరకు ఎవరూ గుర్తించలేకపోయారు. మహేశ్ తల్లిదండ్రుల్లో 15ఏళ్ల కిందట తండ్రి మృతి చెందగా, అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ తల్లి రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో తల్లిదండ్రుల పట్ల ఎనలేని ప్రేమ ఉన్న మహేశ్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కాగా అతనికి సోదరుడు మణికంఠ ఇటీవల బతుకుదెరువురీత్యా మారిషస్‌కు వెళ్లాడు. దీంతో ఒంటరితనంతో ఎక్కువగా ఆలోచించిన మహేశ్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. అయితే బుధవారం స్నేహితులు, బంధువులు కొందరు అతని ఇంటి వద్దకు వెళ్లగా లోపల గడియపెట్టి ఉండడం, కిటికీ వద్ద దుర్వాసన రావడంతో తలుపులు పగలగొట్టి చూడగా శవమై కనిపించాడు. ఈ సమాచారం పోలీసులకు అందించారు. వారు 108 వాహనం ద్వారా మృతదేహాన్ని స్థానిక పెన్నానదిలోకి తీసుకెళ్లి అక్కడే శవ పరీక్షలు పూర్తి చేసి ఖననం చేశారు. కాగా మృతుడు మెడికల్ రెప్‌గా పనిచేసే వాడని బంధువులు, స్నేహితులు తెలిపారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవు



కడప నగరంలో డీఎల్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, న్యాయవాదులు

కడప రూరల్, జూన్ 12: బాలలతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబావక్రుద్దీన్ పేర్కొన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన మీడియాకు తెలియజేశారు. కడప నగరంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, ఆయాశాఖల అధికారుల చేత న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి పోస్టర్లను ఆవిష్కరించామన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ చేపట్టిన బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015 గురించి, ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్యను తెలియజేశామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పక చదివించి ప్రయోజకులను చేయాలన్నారు.

నగరంలో అవగాహన : ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో బుధవారం కడప నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మాసాపేటలోని కమల్ ఆటోగ్యారేజ్, పెట్రోల్ బంకులు, షాపులు, తులసి కాంప్లెక్స్ ఆర్కే ఆటోవర్క్‌షాపు తదితర ప్రాంతాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారులు, పారాలీగల్ వలంటీర్లు సంయుక్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులను ఏర్పాటు చేసి నిర్బంధ కార్మికుల రక్షణ, పునరావాస కార్యక్రమాలు గురించి తెలియపరిచారు.

20, 21న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్) జూన్ 12: తమిళనాడు రాష్ట్రం లోని అరుణాచలగిరి ప్రదక్షణకు వీలుగా తిరువణ్ణా మలైకి ఆర్టీసీ కడప రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి ఈనెల 20, 21 తేదీలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుంచి ఈనెల 20న సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 8 గంటలకు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలానికి చేరుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1072గా నిర్ధారించారు. బద్వేల్ డిపో నుంచి అల్ట్రాడీలక్స్ బస్సు ఉదయం 7 గంటలకు బయలుదేరి వయా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలానికి వెళుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1566. దీంతో పాటు మరో సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 7గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా చేరుకుంటుంది. టికెట్ ధర రూ.1475, మైదుకూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 9 గంటలకు బయలుదేరి కడప నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1130లుగా నిర్ణయించారు. ప్రొద్దుటూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 7 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు, కడప మీదుగా చేరుకుంటుంది. టికెట్ ధర రూ.1273, పులివెందుల డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 7గంటలకు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలానికి వెళుతుంది. టికెట్ ధర రూ.1242, జమ్మలమడుగు డిపో నుంచి ఈ నెల 20న సూపర్ లగ్జరీ బస్సు సాయంత్రం 5గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా అరుణా చలం చేరుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1352 నిర్ణయించినట్లు తెలిపారు. ఇదిలా వుండగా ఇదే డిపో నుంచి ఈ నెల 21న సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 5-30కి బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా అరుణాచలం చేరుకోనుంది. ఇందులో టికెట్ ధరగా రూ.1352గా నిర్ధారించారు. ఈఅవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం కోరారు.

దాల్మియా పరిసర ప్రాంతాల్లో లోకాయుక్త బృందం పర్యటన



వివరాలు సేకరిస్తున్న లోకాయుక్త అధికారులు

మైలవరం, జూన్ 12: మండల పరిధిలోని దాల్మియా పరిశ్రమ ప్రాంతాలైన నవాబుపేట, దుగనపల్లి గ్రామాల్లో లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం పర్యటించింది. దాల్మియా పరిశ్ర మలో బ్లాస్టింగ్ చేయడం వలన సమీప గ్రామాలైన నవాబుపేట, దుగనపల్లి గ్రామాల్లోని ఇళ్లలో నెర్రెలు చీలి ఇళ్లు దెబ్బ తింటున్నాయని.. పంట పొలాలు కూడా దుమ్ము దూళి పడి దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోయిందని లోకాయుక్తకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లోకాయుక్త అధికారుల బృందం జమ్మలమడుగు ఆర్డీవో, రెవెన్యూ, ఇరిగేషన్, పొల్యూషన్, మైన్స్ అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించింది. దాల్మియా పరిశ్రమలోని మైన్స్, నవాబుపేట, దుగనపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో పరిశ్రమ వల్ల కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

28 నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 12: వైవీయూ ఎంఏ, ఎంకామ్ ఎంఎస్సీ, ఎంపీఈడీ, పీజీ డిగ్రీ 2, 4 సెమిస్టరు పరీక్షలు ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. రెండో సెమిస్టరు పరీక్షలు 28న, జూలై 1,3,5,8,10 తేదీల్లో ఉంటాయన్నారు. నాలుగో సెమిస్టరు పరీక్షలు 29, జూలై 2, 4, 6, 9, 11 తేదీల్లో జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.


ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి, కట్టా దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా


మదనపల్లె టౌన్: చంద్రబాబు చిత్రపటం వద్ద టెంకాయలు కొడుతున్న కేహెచ్ ప్రశాంత్


నిమ్మనపల్లె: చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో సంబరాలు చేసుకొంటున్న టీడీపీ నాయకులు


గుర్రంకొండ బస్టాండులో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

మిన్నంటిన సంబరాలు

● ఆనందోత్సాహాల్లో నేతలు, కార్యకర్తలు ● పలుచోట్ల కేక్ కటింగ్‌లు, అన్నదానాలు, బైక్ ర్యాలీలు ● కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న అభిమానులు

మదనపల్లె టౌన్, జూన్ 12: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టడం, చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణస్వీకారం చేయడంతో మదనపల్లెలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సంబరాలు మిన్నంటాయి. బుధవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు రాధ, మహాలక్ష్మి, టీడీపీ నాయకులు దాదాపీర్, బాబా, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక శేషమహల్ సర్కిల్ వద్ద టీడీపీ సీనియర్ నేత కె.హెచ్. ప్రశాంత్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్రపటం ఎదుట 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. చిత్తూరు జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు శివకుమార్‌శర్మ, ఎస్.ఆర్. రాజేష్, అంజాద్ మౌలానా, రాజేష్, నిజాం, జోషి పాల్గొన్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మార్పురి వరుణ్, శేషాచలపతినాయుడు, అమ్మినేనివీధి చిన్ని ఆధ్వర్యంలో 300 బైక్‌లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీరామ హరిహరన్, హరినాథ్‌దేవర, తదితరులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను చేతపట్టి ఊరేగించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్ ప్రసంగించారు. స్థానిక శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో పెద్ద స్క్రీన్ మీద చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రదర్శించారు. టీడీపీ నేత మార్పురి శశిధర్‌రావు అందరికి భోజన సదుపాయం కల్పించారు. స్థానిక నక్కలదిన్నె వద్ద శివస్వామి ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీ చిత్రపటాల ముందు పొట్టేలును బలి ఇచ్చారు. బీజేపీ నాయకుడు బండి ఆనంద్, నరేంద్ర, నవీన్, రవి, మధు, హరిహరన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు నివాసంలో యోగేంద్రబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టీడీపీ నాయకులకు పంచిపెట్టారు. పలుచోట్ల బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్క్రీన్, ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మంత్రి వర్గం ప్రమాణ స్వీకారాన్ని లైవ్‌లో ప్రదర్శించారు. ఎంపీడీవో భానుప్రసాద్, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ఉపాధి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: కొత్తపల్లె పంచాయతీలోని కొత్తఇండ్లలో కేక్‌కట్ చేసి, స్వీట్స్ పంచిపెట్టారు. మాజీ సర్పంచ్ ఆర్‌కే శ్రీనివాసులు, చంద్రశేఖర్, గ్రామఅధ్యక్షుడు ప్రభాకర్, మేస్త్రీ చంద్ర, బాలాజీ, అగర్తల ప్రసాద్, సయ్యద్‌బాషా, రాజేంద్ర, మేస్త్రీ వెంకటరమణ పాల్గొన్నారు. శ్రీకృష్ణా కళ్యాణ మండపంలో ఇసుకనూతనపల్లెకు చెందిన జయరాం యాదవ్, మదనపల్లె టీడీపీ రూరల్ అధ్యక్షుడు వెంకటరమణయాదవ్ స్వీట్స్ పంపిణీ చేశారు. నక్కలదిన్నెలో శివస్వామి ఆధ్వర్యంలో స్వీట్స్ పంచిపెట్టారు కొరపాటి నరేంద్ర, నవీన్, జంగాల రవి, మధు, గండికోటప్రకాష్, హరిహరన్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సీనియర్ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళుల అర్పించి కొబ్బరి కాయలు కొట్టి వారి ఆనందాన్ని పంచుకున్నారు.

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీఎన్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండు సర్కిల్, కదిరి రోడ్డు, ఆర్టీసీ బస్టాండు మీదుగా పెట్రోల్ బంకు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా పేలుళ్ల మధ్య ర్యాలీ సాగింది. కేరళ కళాకారుల డప్పు ప్రదర్శన ఆకట్టుకుంది. టీడీపీ శ్రేణులు డీజే ఏర్పాటు చేసుకుని డాన్సులు చేశారు. బస్టాండు సర్కిల్‌లో టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, కట్టా దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టారు. మార్కెట్ యార్డులో మూడు వేల మందికి అన్నదానం చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, చిత్ర పటాలకు పాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, టీడీపీ నేతలు తోట గిరిధర్, మయూన్‌బాషా, కేశవులు, మూగి రవిచంద్ర, కట్టా శ్రీనివాసులు, గుత్తావారిపల్లె రమణ, కేబీఎన్ టమోటా మండీ యజమాని కట్టా బాబునాయుడు, కట్టా విజయ్ నాయుడు, నాయకులు ప్రతాప్ నాయుడు, భాస్కర్ నాయుడు, నాగేంద్ర, సుదర్శన్, గొడ్డుమూరు రవి, రమణ మూర్తి శ్రీనివాసులు, రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ ఊరగాయల రామచంద్ర, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాల యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో పొలప్ప, తహసీల్దార్ అనీల్‌కుమార్, ఆర్ఐ ఆంజనేయులు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. ప్రమాణస్వీకార మహోత్సవానికి టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, పాలకరి రాష్ట్ర సమితి సభ్యులు జేసీబీ సుధాకర్ నాయుడు తదితరులు హాజరయ్యారు.

గుర్రంకొండ: స్థానిక బస్టాండులో బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నౌషాద్‌అహ్మద్, తస్వీర్, బాబాజాన్, హేస్సాన్, మౌలా, శంకర, రెడ్డిశేఖర్, రమణ, నవాబ్‌లు పాల్గొన్నారు.

కలకడ: కలకడ సిద్ధేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 202 కొబ్బరి కాయలను సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిపట్ల వెంకట రమణ నాయుడు, కోనేని రెడ్డెప్పనాయుడు, మల్లయ్యనాయుడు, రెడ్డిశేఖర్, నారాయణ, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: పురుషోత్తం, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, తెలుగుయువత నరసింహులు, శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చలపతినాయుడు, బాలకృష్ణారెడ్డి, నరేంద్రనాయుడు, సుధాకర్‌రెడ్డి, నంది రెడ్డప్ప, రవి, శివకుమార్‌నాయుడు, బీజేపి అసెంబ్లీ కోకన్వీనర్ శంకర్‌రెడ్డి, సుబహాన్, రాజారెడ్డి, సురేష్, నగేష్, కోసువారిపల్లెలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, సోముశేఖర్, జయరాంరెడ్డి, కృష్ణమూర్తి, నరేంద్రరెడ్డి కోటకొండలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డప్ప, రాజేష్, మాజీ సర్పంచ్ మల్లయ్య, గ్రామాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాంతారావు, రామయ్య, శ్రీనివాసులు, రాజేష్‌రెడ్డి రేణుమాకులపల్లెలో నిజాముద్దీన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, వెంకట్రమణ, ఆవుల రెడ్డప్పరెడ్డి, వెంకట్రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ సభ్యులు నాగరత్న రెడ్డప్ప తంబళ్లపల్లె శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జనసైనికులు పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేసి జై జనసేన, జై పవన్‌కళ్యాణ్ అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకుడు ఎద్దుల నరసింహులు, సురేష్, రాజారెడ్డి, సుబహాన్, వేణు, శ్రీనాథ్, జయసూర్య తదితరులు ఉన్నారు.

పెద్దమండ్యం: మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో కూటమి యువనాయకులు వేంపల్లి రఫీ, రామకృష్ణ (ఆర్‌కే) నార శ్రీనివాసులు, అస్రఫ్, నాగూర్‌వలీ, రమేష్ మౌలా, కలిచెర్లలో ఎంపీటీసీ సభ్యుడు రుక్మాంగధరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల జనసేన అధ్యక్షుడు శంకర, సయ్యద్‌షావలీ, ప్రకాష్‌రెడ్డి, గరీబున్నీషా, రామకృష్ణరెడ్డి, చౌడప్ప, రామచంద్ర, జమృత్‌బాష, చలపతి తదితర నాయకులు సంబరాలు చేసుకున్నారు. భారీగా బాణసంచా పేల్చారు. కేక్‌లు కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. స్వీట్లు, పండ్లు పంచారు. అన్నదానం చేశారు.

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. భారీగా టెంకాయలు కొట్టారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు స్థానిక బస్టాండులో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అన్నదానం చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు చంద్ర శేఖర్(చిన్నా), బీజేపీ నాయకులు సిమెంట్ శీనా, కుమ్మరవారిపల్లె రాజేష్, పాలగిరి రామాంజులు, రాము, భజంత్రి రామచంద్ర, నందిమూర్తి, అంకిరెడిపల్లె రమేష్‌రెడ్డి, ఎగువపల్లె రామచంద్ర, బందార్ల వెంకట్రమణ, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కొత్తోళ్ల శ్రీనివాసులు, కిరణ్, తలుపుల శంకర తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది నరేంద్రమోదీ, నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చిత్ర పటా లను పాలతో అభిషేకించారు.

రామసముద్రం: చెంబకూరులో నాయకులు రామమూర్తి, కేసీపల్లె కొండూ రు నారాయణరెడ్డి అన్నదానం చేశారు. మండల కేంద్రంలో అభిమానులు మొహ్మద్, చిన్నా, టీడీపీ నాయకులు అశోక్, శివ, దాసరి ప్రదీప్ గోవాలోని బీచ్‌లో టీడీపీ జెండాను ప్రదర్శించారు.

పీలేరు: ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని సామాన్య ప్రజలు వీక్షించేందుకు స్థానిక అధికారులు స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఏర్పాట్లు చేశారు. తహసీల్దారు మహబూబ్ బాషా, డీటీలు సుబ్రహ్మణ్యం, విజయ్, ఆర్ఐ చాణక్య వీఆర్వోలు రవి, కవిత, టీడీపీ నాయకులు మల్లెల రెడ్డిబాషా, లడ్డూ జాఫర్, షరీఫ్, కొవ్వూరు హరి, రమాదేవి, షమ, అత్తార్ చాను, షౌకత్‌అలీ, టీఎన్ ఎస్‌ఎఫ్ ముబారక్, ఎన్టీఆర్ నఫీస్, బర్కతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె: బసినికొండ పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చారు. అంతకు ముందు బసినికొండ, రామాచార్లపల్లె నుంచి టీడీపీ కార్యకర్తలు ర్యాలీగా అక్కడికి చేరుకున్నారు. స్థానిక నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జంగం నారాయణ, కత్తి లక్ష్మన్న, సంద్ర నారాయణస్వామి, నాగేంద్ర, నటశేఖర్, యశ్వంత్, నారాయణస్వామి, వైకేజీ రమేష్, దేవుడు రమేష్, ఆటో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు, టీడీపీ నేత కంచర్ల శ్రీనివాసులు నాయుడు నిమ్మనపల్లె సర్కిల్‌లోని ఆయన కార్యాలయంలో గణపతి, నవగ్రహాల హోమం నిర్వహించారు. శ్రీనివాసులునాయుడు సతీమణి కంచర్ల కృష్ణవేణి, ఆయన కుమారుడు కంచర్ల చింటూ, ఉమేష్‌నాయుడు, వెంకటస్వామి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బలరాంరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కురబలకోట: టీడీపీ నేత కొమ్మద్ది ఖలీల్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంగళ్ళు కురబలకోట, దొమ్మన్నబావి తదితరచోట్ల కేక్ కట్ చేశారు. కురబలకోటలో అన్నదానం చేశారు జంగా రాఘవరెడ్డి, తోట అశోక్, ఎల్లారెడ్డి, రెడ్డిశేఖర్, మనోజ్, అంజి, ముస్కీన్, బావాజీ, బావాఫకృద్దీన్, కామకోటి ప్రసాదరావు, రాఘవరావు, లక్ష్మన్న, రవి, తిమ్మరాయుడు, సూరి, సదాశివ, ప్రసన్న, రామకృష్ణ, సద్దాం, జయచంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: పట్టణంలోని జ్యోతి చౌక్‌లో చంద్రబాబు నరేంద్రమోడీ, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం భారీ కేకును కట్ చేసి పంచిపెట్టారు. భారీ ఎత్తున బాణసంచా పేల్చి 101 కొబ్బరికాయలను కొట్టారు. సర్కిల్‌లో ఎల్‌ఈడి స్క్రీన్ ఏర్పాటుచేసి ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. జనసేన కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు, చింతలకిరణ్ రాయల్, బంగారు వెంకట్రమణ, ఎండీ మస్తాన్, గంజిమోహన, సిద్దప్ప, నాగరాజు, షాకీర్, సమీఉల్లా, నాగేంద్ర, సుధాకర్, ఓబులేసు, రంజిత్, షరత్ పాల్గొన్నారు.


మదనపల్లె టౌన్: ఎస్‌ఏ మస్తాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


మదనపల్లె: కేక్ కట్ చేస్తున్న గంగారపు బాబురెడ్డి


అంగళ్లులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు తదితరులు


కలకడ: కొబ్బరి కాయలు కొడుతున్న నేతలు


తంబళ్లపల్లెలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు


పెద్దతిప్పసముద్రంలో టెంకాయలు కొడుతున్న నేతలు


పెద్దమండ్యంలో కూటమి నాయకుల సంబరాలు



తంబళ్లపల్లె: పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా ఫ్లెక్సీ చూపుతున్న జనసైనికులు

ఈఏపీ సెట్ ఫలితాల్లో 'కృష్ణారెడ్డి సిద్ధార్థ' విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, జూన్ 12: ఈఏపీ సెట్ ఫలితాల్లో మదనపల్లెలోని కృష్ణారెడ్డి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి తెలిపారు. తమ కళాశాలకు చెందిన ఎస్ మహేంద్ర 3,985, పి.మహేష్ 5,102, ఎం.గౌతమి 5,627, పి.అల్లాబక్షుఖాన్ 7,532, పి. హర్షవర్ధన్ 7,835, బి.బాలాజీ 9,215, ఎస్ హిమయశ్రీ 11,299, ఎం.కిషోర్ 12,354, జి.తుషార్ 13,392, కె. లోహిత 14,207, బి పుష్పప్రియ 14,966 ర్యాంకులు సాధించారని చెప్పారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

పులుసుగుంతలులో తాగునీటి కాలుష్యం

● పలువురికి అస్వస్థత ● స్పందించిన వైద్య బృందం

కురబలకోట, జూన్ 12: కురబలకోట మండలం తెట్టు పంచాయతీ పులుసుగుంతలులో తాగునీరు కలుషితం కావడంతో పలువురు అనారోగ్యానికి గురయ్యారు. ఐదుగురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికావడంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. స్థానిక వైద్యసిబ్బంది గ్రామానికి చేరుకుని వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా వైద్యాధికారి కొండయ్య గ్రామాన్ని సందర్శించి సలహాలు,సూచనలు తెలియజేశారు. క గ్రామస్తుల నుంచి రక్తనమూనాలను సేకరించారు.


బోరు వద్ద క్రిమి సంహారక మందులు చల్లుతున్న వైద్య సిబ్బంది

మార్కెట్ యార్డులో అన్నదానం

మదనపల్లె అర్బన్, జూన్ 12: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో రాటకొండ విజయ్ భాస్కర్ నాయుడు జన్మ దినోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడుతూ మదనపల్లె పరిసర ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులకు అభినందనలు తెలిపారు. రాటకొండ శ్రావ్య పురందర్, హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్, సభ్యులు సాదిక్, సాంబ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

మదనపల్లె అర్బన్, జూన్ 12: రేషన్ సక్రమంగా సరఫరా చేయాలని సీఎస్ డీటీ రెడ్డెప్ప ఆదేశించారు. ఇందిరానగర్‌లో బుధవారం రైస్‌బండిని, అందులో తూకాలను పరిశీలించారు. బయోమెట్రిక్ మిషన్ సక్రమంగా పని చేస్తోందా అని అడిగి తెలుసుకున్నారు. తూకాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


రైస్‌బండిని తనిఖీ చేస్తున్న డీటీ రెడ్డెప్ప

ఈసీటీ యంత్రంతో మానసిక రోగులకు చికిత్సల ప్రారంభం


ఈసీటీ యంత్రంతో వైద్యబృందం

మదనపల్లె టౌన్, జూన్ 12: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో మానసిక రోగులకు ఈసీటీ (ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపి) చికిత్స ద్వారా రోగం నయం అవుతుందని జీటీహెచ్ అదనపు డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.రాజు తెలిపారు. బుధవారం స్థానిక జీటీహెచ్‌లో రూ.4.5 లక్షలతో తెప్పించిన ఈసీటీ యంత్రంతో మానసిక రోగులకు చికిత్సలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన మానసిక జబ్బులతో బాధపడే వారికి, స్కిజోఫ్రెనియా, ఆత్మహత్య ఆలోచనలు కలిగే వారికి ఈసీటీ చికిత్స ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మానసిక సమస్యలు, ఆందోళనలు, కుంగుబాటు, దిగులు, ఆత్మన్యూనతభావం, సమస్యలతో ఇబ్బంది పడే వారు జీటీహెచ్‌లో వైద్య నిపుణులను సంప్రదించాలని కోరారు. అనంతరం మానసిక వైద్యుడు డాక్టర్ విష్ణు, రాధిక, సైకాలజిస్టు అలేఖ్య, ఎస్.ఆర్. జ్యోత్స్నను అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్ఎంవో ప్రసాదరాజు, రమేష్, ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, హేమలత, నాగశ్రీ, జయప్రభలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏకాదశ వార్షికోత్సవాలు

మదనపల్లె అర్బన్, జూన్ 12:స్థానిక వాసవీ భవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం లో బుధవారం మదనపల్లె ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో ఆలయ ఏకాదశ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకుడురామచంద్రశర్మ సుప్రభాత సేవలో మేల్కొలిపి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో హోమాలతో పాటు మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు మహామంగళ హారతి ఇచ్చి దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం మదనపల్లె అధ్యక్షుడు ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు దేవతా సతీష్, సూరేగిరిధర్, తదితరులు పాల్గొన్నారు.


పూర్ణాహుతి సమర్పిస్తున్న ఆర్యవైశ్యసంఘం సభ్యులు

వైభవంగా గంగమ్మ ఊరేగింపు

మదనపల్లె అర్బన్, జూన్ 12: స్థానిక అమ్మచెరువు మిట్టలోని గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక వాహనంలో గంగమ్మ ఉత్సవ విగ్రహానికి విశేషంగా అలంకరణలు చేసి ఊరేగింపు నిర్వహించారు. గంగమ్మ ఊరేగింపులో మేళతాళాలు, బళ్లారి డ్రమ్స్, వివిధ వాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జాతర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం పగలు తిరుణాల నిర్వహించారు. కార్యక్రమాలను . కంచర్ల మల్లికార్జున నాయుడు, వై.శ్రీనివాసులు, డాన్స్ రెడ్డెప్ప, రమణ, శివన్న, నాగేంద్ర, వెలుగు ఉదయ్‌మోహన్‌రెడ్డి, మణి, శ్రీరాములు, రమేష్, ధనరాజు, శంకర, లక్ష్మీనారాయణ, సుధాకర్‌నాయుడు, రవీ, ఆనంద్, తదితరులు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో పాలేటి గంగమ్మ జాతర

మదనపల్లె అర్బన్,జూన్ 12: చిప్పిలిలోని పాలేటి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి ఆధ్వర్యంలో ఊరేగించారు. ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. అంతకుముందే మహిళలు దీలు, బోనాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులు చాందినీ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో చెంద్రాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హైదరాబాదుకు కొత్తబస్సు

మదనపల్లె అర్బన్, జూన్ 12: మదనపల్లె- హైదరాబాదు, జీడిమెట్లకు వెళ్లడానికి కొత్త బస్సు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. కొత్తబస్సులో సీటుకు సీటుకు మధ్య కాళ్లు పెట్టుకోవడానికి అనుకూలంగా స్థలం, ప్రతి సీటుకు సెల్ చార్జర్, బస్సులో ఎల్‌ఈడీ టీవి ఉందన్నారు. ఈ బస్సు మదనపల్లె నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి, ఎంజీబీఎస్‌కు ఉదయం 6.30 గంటలకు, జీడిమెట్లకు 7.30 గంటలకు చేరుకుంటుంది. జీడిమెట్ల నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి ఉదయం 7 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. మదనపల్లె పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

గొంతు కోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జూన్ 12: కుటుంబసభ్యులతో గొడవపడి గొంతు కోసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం రాత్రి పట్టణంలోని సొసైటీ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రవికుమార్(40) తన ఇంటిలో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది పక్కనే వున్న కత్తితో గొంతు కోసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు అతడిని స్థానిక సర్వజన బోధనాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

రంగనాయకాలయానికి వెండి విగ్రహం అందజేత

చిట్వేలి, జూన్ 12: మండలంలోని నగరిపాడు రంగనాయకస్వామి ఆలయానికి రూ.5 లక్షలు విలువ చేసే స్వామివారి ప్రతిమను భక్తులు అందజేశారు. నగరిపాడు పంచాయతి కంసాలపల్లె గ్రామానికి చెందిన చిన్నపోలు రంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుబ్బలక్షుమ్మ కుమారుడు చినుపోలు శరత్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు, కుటుంబ సభ్యులు రంగనాయక ప్రతిమను వెండితో తయారు చేసి అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగాచారికి ఈ ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా వారికి మేళతాళాలతో ఆలయంలో స్వాగతం పలికారు.

రూ.20,500 ఆర్థిక సాయం

చిట్వేలి, జూన్ 12: కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం సీతారాంపేట గ్రామానికి చెందిన భీమిశెట్టి బలరామయ్య(32)కు చిట్వేలి మానవత సంస్థ రూ.20,500 ఆర్థికసాయం అందించారు. ఆయనకు భయంకరమైన క్యాన్సర్ లుకేమియా సోకడంతో వైద్యులు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని సూచించారు. దీంతో మండలం నుంచి ఫోన్‌పే ద్వారా వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు.



సభా వేదిక వద్ద కోలాహలం





వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

టి.ఒడ్డూరులో ప్రత్యేక మెడికల్ క్యాంపు





పలమనేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టి.ఒడ్డూరు గ్రామస్థులు - టి.ఒడ్డూరలో ప్రత్యేక మెడికల్ క్యాంపు

పలమనేరు, జూన్12: పలమనేరు మండలం టి.ఒడ్డూరులో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసింది. టి.ఒడ్డూరులో మంగళవారం దాదాపు 30 మంది కల్తీ ఆహారం కారణంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఒక ఇంటిలో జరిగిన శుభస్వీకరణ కార్యక్రమానికి హాజరైన వారు సోమవారం రాత్రి నుంచి వాంతులు విరేచనాలతో బాధపడుతూ చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. వీరిలో ముగ్గురు పిల్లల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున మెరుగైన చికిత్స కోసం కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. పలమనేరు ఆసుపత్రిలో బుధవారం కూడా 13 మందికి వైద్యులు చికిత్సలు కొనసాగిస్తున్నారు. దీంతో టి.ఒడ్డూరు పాఠశాల ఆవరణలో కొలమాసనపల్లి వైద్యాధికారిణి అనూకి ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వాంతులు విరేచనాలతో బాధపడుతున్న 9 మందికి వైద్యులు చికిత్సలు చేసి సెలైన్లు పెట్టించారు. తాగునీటి ట్యాంకును క్లోరినేషన్ చేయించడంతో పాటు బుధవారం ప్రత్యేక ట్యాంకరు ద్వారా క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

కుమారుడికి తీవ్ర గాయాలు







రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అసీస్ గోయెల్ - కారులోనే ఇరుక్కుపోయిన జ్యోతి గోయెల్ మృతదేహం - లారీ ఢీకొన్న కారు ప్రమాద దృశ్యం

పాకాల, జూన్ 12: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పాకాల మండలం గాదంకి ఎస్‌ఎఆర్‌ఎల్ సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్త దుర్మరణం చెందారు. ఏడేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి తిరుపతికి వస్తున్న కెఎ51ఎంపి 7454 నెంబరు గల కారు ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయి లారీలో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బెంగుళూరులో ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జ్యోతి గోయెల్ (34), ఆయన భార్య అసిస్ గోయెల్ (30) అక్కడికక్కడికే మృతిచెందారు. వారి కుమారుడు సుశాల్ గోయెల్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాలుడిని చికిత్సకోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తరలించి, పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి(మంగళం), జూన్ 12: ప్రకాశం జిల్లా కొమరోలు మండలం చింతపల్లి అటవీ ప్రాంతంలో 107 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ చెప్పారు. ఆయన కథనం మేరకు... కడప సబ్ డివిజన్ ఆర్‌ఎస్‌ఐ నరేష్ టీం చింతపల్లి అటవీప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా సోమవారం రాత్రి భైరవస్వామి తిప్ప వద్ద ఆటో, మోటారుసైకిల్ కనిపించాయి. పోలీసులను గమనించిన వారు పారిపోగా ఇద్దరిని మాత్రం పట్టుకోగలిగారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన రాజేంద్రకుమార్(41), ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం గడికోటకు చెందిన వాసం వెంకటసుబ్బయ్య(43)లుగా వారిని గుర్తించారు. వారి నుంచి 107 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషనుకు తీసుకువచ్చి బుధవారం ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేశారు.





రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం రాత్రి సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టరు షన్మోహన్, జేసీ శ్రీనివాసులు



సీఎంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తవణంపల్లె మండలం దిగువమాఘంలో కేక్ కట్ చేస్తున్న అమరరాజా వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు

సమాజ హితానికి రచనలు అవసరం

● కుప్పం రెడ్డెమ్మ సాహితి పురస్కారాల పంపిణీలో డాక్టర్ కె.రామలక్ష్మి

చిత్తూరు కల్చరల్, జూన్ 12: సమాజ.హితానికి పురాణ, ఇతిహాసాలతో పాటు సామాజిక, సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానిక రచనలు చాలా అవసరమని కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టరు కె.రామలక్ష్మి అభిప్రాయపడ్డారు. 2023వ సంవత్సరపు నవలలు, కథానికల పోటీల విజేతలకు బుధవారం చిత్తూరులోని రాజా మహల్ హోటల్‌లో కుప్పం రెడ్డెమ్మ సాహితి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు తొలిగి, అందరిలో చైతన్యం కలిగించేలా రచనలు సాగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన తల్లి కుప్పం రెడ్డెమ్మ పేరుతో 31 సంవత్సరాలుగా అవార్డులను పంపిణీ చేస్తూ డాక్టర్ రామలక్ష్మి రచయితలను ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. ఇక, కాశీపురం ప్రభాకర్ రెడ్డి రచించిన మేడం నవలను సి.ఎన్.చంద్రశేఖర్.. కె.ఎ.మునిశేఖర్‌పిళ్లై రచించిన పుత్రికా శత్రు నవలను ఎం.ఆర్.అరుణకుమారి.. రోహిణి పంజారి రచించిన నల్లసూరీడు కథానికల సంపుటిని డాక్టర్ రోజాప్రియ.. సుగుణారావు రచించిన సుగుణ కథాభిరామం కథానికలను డాక్టర్ వి.హరినాయుడు సమీక్షించారు. రచయిత, రచయిత్రులను నిర్వాహకులు రామలక్ష్మి, రోజాప్రియ, నిరంజన్‌రెడ్డి నగదు పురస్కారం, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రత్యేక ప్రోత్సాహకంగా కాకినాడకు చెందిన యువ వైద్యుడు మురళీకృష్ణ, హరికథా కళాకారిణి ఎం.లక్ష్మిని సత్కరించారు. కుప్పం రెడ్డెమ్మ సాహితి పురస్కారగ్రహీతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల బాలక్రిష్ణారెడ్డితో పటు పలువురు సాహితీ వేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

హెల్త్ చెకప్ కోసం వస్తూ..

అదుపు తప్పి కారు బోల్తా ● నాలుగు నెలల గర్భిణి మృతి ● ఇద్దరికి స్వల్ప గాయాలు

బంగారుపాళ్యం, జూన్ 12: నాలుగు నెలల గర్భిణి. ఆరోగ్య పరీక్షల కోసం ఆస్పత్రికి వస్తుండగా కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆమె అసువులు బాశారు. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన బుధవారం ఉదయం బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్ దొరచెరువు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా గుజ్జనగుండ్లలోని బొజ్జరాయి వీధిలో నివాసముంటున్న ప్రకాష్ కుమార్, లక్ష్మి దంపతుల కుమార్తె ఎస్.రాగ్నిజైత్రకు, గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ప్రతాప్‌తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. ప్రతాప్ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇన్నాళ్లకు ఆమె గర్భవతి కావడం.. ప్రస్తుతం నాలుగో నెల కావడంతో వేలూరు సీఎంసీలో చెకప్ చేయించడానికి బెంగళూరు నుంచి కారులో బయలుదేరారు. మొగిలిఘాట్ దొరచెరువు వద్దకు రాగానే కారు అదుపుతప్పి ఐదు పల్టీలు కొట్టింది. వెనుకసీటులో ఉన్న రాగ్నిజైత్ర(32) అక్కడికక్కడే మృతిచెందగా, ముందు సీటులో ఉన్న ప్రతాప్, ఆమె తల్లి లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. ప్రతాప్, లక్ష్మి బోరున విలపిస్తుండడం పలువురిని కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాగ్నిజైత్ర మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి లక్ష్మి



అదుపుతప్పి బోల్తాపడి నుజ్జునుజ్జయిన కారు